క్లుప్తంగా

ఇ-క్రాప్ నమోదులో అభ్యంతరాలు తెలపాలి

చీమకుర్తి: మండలంలో ఇ- క్రాప్ నమోదులో ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత రైతులు తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్ ఇ- క్రాప్ నమోదు చీమకుర్తి మండలంలో 4,058 ఎకరాల్లో నమోదు చేశామన్నారు. ఈనెల 26 నుంచి 29 వరకు ఇ-క్రాప్ నమోదు వివరాలకు సంబంధించిన లిస్టులను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తామన్నారు. అభ్యంతరాలు ఉంటే వాటిని ఈనెల 30వ తేదీ లోపు సరి చేస్తామని చెప్పారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

నాగులుప్పలపాడు: మండల పరిధిలోని వివిధ రకాల విద్యుత్ సమస్యలను పరిష్కరించడం కోసం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఉప్పుగుండూరు గ్రామంలోని కాపు కల్యాణ మండపంలో కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రిడ్రెస్సల్ ఫోరం విజయవాడ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏఈ రమేష్ బాబు తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ రిటైర్డ్ జడ్జి విక్టర్ ఇమ్మాన్యుయేల్‌తో పాటు జిల్లా స్థాయి విద్యుత్ అధికారులు పాల్గొనన్నుట్లు తెలిపారు.

మొక్కలే ప్రాణాధారం



మొక్కలు నాటుతున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సభ్యులు

ఒంగోలు అర్బన్: స్థానిక పులి వెంకటరెడ్డి కాలనీ, పున్నయ్య భవన్ రోడ్డు వద్ద రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా తమవంతు బాధ్యత నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాదకరమైన చెట్లను తొలగించడంతో మొక్కలు నాటాలని సంఘం నిర్ణయించిందన్నారు. దీనిలో సంఘం నాయకులు బి. శ్యామలరావు, అంకిరెడ్డి, కంచర్ల సుబ్బారావు, మారెళ్ల వెంకటరావు, సుభాని, ప్రసాద్, శరత్‌బాబు, శేషయ్య పాల్గొన్నారు.

పేదలకు నివేశన స్థలాలివ్వాలి

మార్కాపురం రూరల్: పేదలకు నివాస స్థలాలు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని రాయవరం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో 150 మంది నిరుపేద మహిళలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పార్టీ నేతలు సయ్యద్ జావీద్ అన్వర్, గాలి వెంకట రామిరెడ్డి, బి.రామిరెడ్డి, మస్తాన్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

కొనకనమిట్ల: మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి తెలిపారు. పొదిలి వివేకానంద జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల పార్టీ కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు తప్పకుండా హాజరై సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

సబ్సిడీపై యూరియా

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపి ఆర్బీకేలో యూరియా సబ్సిడీపై అందుబాటులో ఉన్నట్లు ఏఓ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డుతో సంప్రదించాలని సూచించారు. మండలంలోని రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. దక్షిణాయనం, ఆశ్వీజ మాసం, రేవతి నక్షత్రం, త్రయోదశి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఆరోగ్య రక్షణే జగనన్న సురక్ష లక్ష్యం

చీమకుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు విజ్ఞప్తి చేశారు. గురువారం పల్లామల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతి వారికి నిపుణులైన వైద్యులు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. రోగులకు వైద్యపరీక్షల తదుపరి మందులు, కళ్లజోళ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ ముప్పవరపు తిరుపతమ్మ, ఎంపీటీసీ గండి నాగమ్మ, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పల్లామల్లిలో మందులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

వైద్య పరీక్షలతో భరోసా

ఒంగోలు టౌన్: ప్రజలందరూ ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలన్న ఏకై క లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం నగరంలోని కరవది డొంక, వంటవాని కాలనీ, భాగ్యనగర్ నీలాయపాలెం, బృందావన్ నగర్ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా నగరం లోని 9 యూపీహెచ్‌సీ పరిధిలోని సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేయడం జరిగిందని, హెల్త్ సెక్రటరీల ద్వారా ఇంటి వద్దనే 7 రకాల రక్త పరీక్షలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. భాగ్యనగర్ సచివాలయ పరిధిలో 280 మందికి ఓపీ



ప్రసంగిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు

రాసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఇద్దరు జనరల్ ఫిజిషియన్లు, ఒక గుండె జబ్బుల వైద్య నిపుణులు, ఒక ఆప్తమాలజీ వైద్యుడు పాల్గొని వైద్య సేవలను అందిస్తారన్నారు. శిబిరంలో వైద్య చికిత్సల కోసం వచ్చిన వారికి హెల్త్ చెకప్‌లో భాగంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. తరువాత కరవదిడొంకలో జరుగుతున్న వైద్య శిబిరం పరిశీలించారు. ఇక్కడి సచివాలయ పరిధిలో 370 మందికి వైద్య సేవలు అందజేసినట్లు వైద్యులు ఆయనకు వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జరుగుతున్న ఈ జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రజలు తమకు అవసరమైన వైద్య చికిత్సలను ఉచితంగా పొందవచ్చన్నారు. కార్పొరేటర్ పసుపులేటి విజయ శ్రీనివాసరావు,ఎంహెచ్ఓ మనోహర్ రెడ్డి , వైద్యులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం: మండల కేంద్రం కొత్తపట్నం గ్రామం సచివాలయం-2 పరిధిలోని మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత తెలిపారు. ఈ క్యాంప్‌లో సూపర్ స్పెషాలటీ డాక్టర్లు హాజరై వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు చేస్తామన్నారు. అరేషన్లు చేయాల్సి వస్తే కార్పొరేట్ హాస్పిటల్‌లో ఉచితంగా చేయిస్తామన్నారు. మీ దగ్గర ఉన్న పాత రిపోర్టులు మీ వెంటపెట్టుకుని రావల్సిందిగా కోరారు.

ప్రతి సభ్యురాలు జీవనోపాధి పొందాలి

మద్దిపాడు: డ్వాక్రా గ్రూపులో ఉండే ప్రతి సభ్యురాలు ఏదో ఒక జీవనోపాధి కలిగి ఉండాలని ఏరియా కోఆర్డినేటర్ ఎం విజయమ్మ అన్నారు. మద్దిపాడు డీఆర్‌డీఏ- వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల సమాఖ్యలోని వీఓ అధ్యక్షులు, వీఓఏలకు నిర్వహించిన మాస్ కాంటాక్ట్ కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రతి సభ్యురాలు జీవనోపాధిని పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని వీఓఏలకు తెలిపారు. వీఓఏలు గ్రామాల్లో 27వ తేదీ నుంచి సమావేశాలు ఏర్పాటు చేసి లబ్ధి దారులను గుర్తించాలన్నారు. వారికి అప్లికేషన్లు తయారు చేసి బ్యాంక్‌ల వద్దకు తీసుకు వెళ్లి వారి సిబిల్ స్కోర్లు చూపాలని వారికి డీపీఆర్‌లు వేయించి తదుపరి బ్యాంకుల్లో లోన్లు ఇప్పించి గ్రౌండిగ్ చేయించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన కలిగే



మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ విజయమ్మ, ఏపీఎం నరేంద్ర

లాభాలు, చేసే విధానం, మార్కెటింగ్ పరిస్థితులు అంశాల వారీగా వీఓఏలకు వివరించారు. ఏపీఎం నరేంద్ర, స్త్రీ సహాయనిధి మేనేజర్ ఎస్ పద్మావతి, ఎస్‌సీ సుబ్బయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు దివ్యవాణి నాగేంద్ర, కోమలి, సీసీలు వీఓఏలు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

ఒంగోలు సెంట్రల్: రైతులు పండిస్తున్న పంటల సాగులో వృథా ఖర్చులను తగ్గించి ఆదాయం పెంచేందుకు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు డీఆర్‌సీ వ్యవసాయాధికారులు శైలజా రాణి, శేషమ్మలు తెలిపారు. చీమకుర్తి మండలం పి. నాయుడు పాలెం గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక కావటంతో గురువారం పాటిమీద పాలెం గ్రామ రైతు చీదర్ల కోటయ్య పొలంలో వరి పొలంను పరిశీలించారు. సాగులో పాటిస్తున్న పద్ధతులను రైతు నుండి తెలుసుకుని ఖర్చు తగ్గించుకుని దిగుబడి పెంచుకునేందుకు అవసరమైన పలు విధానాలను తెలిపారు. ఎంటీయూ 1156 రకం నారుమడిలో రైతులకు గుళికలు వేసే పద్ధతి లేక పోవటంతో ఉల్లికోడు తెగుళ్ల ఆశించే అవకాశం ఉన్నందున సెంటు నారుమడిగి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు వేయించారు. అదేవిధంగా జొన్న పంట వేసిన పొలంలో



డీఆర్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం బడిలో పాల్గొన్న రైతులు, సిబ్బంది

సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేసి తొక్కించటం వలన బాగా చివికి పంటకు మంచి సేంద్రీయ ఎరువు తయారు అవుతుందని చెప్పారు. గతంలో పాటించిన పద్ధతులు రైతులు పొలం బడి ద్వారా తెలిసికొని మంచి దిగుబడులు పొందుతారని చెప్పారు. వీఏఏ శృతి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ దుర్వినియోగంపై అవగాహన

ఒంగోలు సెంట్రల్: నేటి కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ దుర్వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కల్యాణి అన్నారు. మంగళగిరి డిపార్ట్ మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో సైబర్ స్మార్ట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంప్యూటర్ లెక్చరర్ వై. సుష్మ మాట్లాడుతూ సైబర్ కంప్యూటర్, మొబైల్స్ ద్వారా మోసపోతున్న విధానాలను వివరించారు. 160 మంది విద్యార్థులు, 30 మంది అధ్యాపకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆన్‌లైన్ సర్టిఫికెట్లు అందించారు.



అవగాహన తరగతుల్లో అధ్యాపకులు, విద్యార్థులు

బూచేపల్లి ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం

చీమకుర్తి: పూరిగుడిసెలు దగ్ధమైన బాధిత కుటుంబాలకు బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గురువారం తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు, 9, 19 వార్డు కౌన్సిలర్లు కంజుల ప్రతాప్‌రెడ్డి, పాలపర్తి వెంకట్రావు చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. బుధవారం చీమకుర్తి పిడతలపూడి రోడ్డులోని గిరిజన కుటుంబాలకు చెందిన దేవరకొండ వెంకటమ్మ, అంజమ్మ, సుబ్బమ్మకు చెందిన గుడిసెలు కాలి బూడిదైన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆర్థిక సహకారంతో అందించారు. దేవరకొండ దుర్గారావు, స్థానికులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న తహసీల్దార్, కౌన్సిలర్లు

నిత్యావసరాలు సక్రమంగా అందజేయాలి

ముండ్లమూరు: కార్డుదారులకు అన్ని రకాల సరుకులు సకాలంలో అందజేయాలని తహసీల్దార్ నయీం అహ్మద్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి కార్డు దారుడికి కంది పప్పు, గోధుమ పిండి, చక్కెర తప్పకుండా సరఫరా చేయాలన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాలుగు నెలల నుంచి కంది పప్పు నిల్వలు తక్కువగా ఉన్న కారణంగా సరఫరా నిలిచిందని, మళ్లీ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నవంబర్ నెలకు కిలో కంది పప్పు 67 రూపాయలకే ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీటీ పుల్లారెడ్డి, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

బిందు సేద్యంపై రైతులకు అవగాహన



డ్రిప్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు అధికారులు

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ గ్రామంలో క్షేత్ర స్థాయిలో బిందు సేద్య పరికరాలను ఎలా ఉపయోగించాలనే అంశంపై మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. రైతు నారు గోవిందారెడ్డి పొలంలో నిర్వహించిన సమావేశంలో మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు జిల్లా సమన్వయకర్త ఎం.ఓబయ్య మాట్లాడుతూ.. డ్రిప్ పరికరాల ఏర్పాటు, డ్రిప్ పరికరాల వాడుక నిర్వహణ, నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యాలపై, ఆమ్ల చికిత్స విధానాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ నవీన్‌కుమార్, డీలర్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్ అచ్చయ్య, ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

గృహ పరికరాలు దగ్ధం

రాచర్ల: మండలంలోని అనుమలవీడు పాత మసీదు బజారులోని సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ సక్రమంగా లేకపోవడంతో నివాస గృహాల్లోకి రెండు ఫేస్‌లు కరెంటు సరఫరా కావడంతో నివాస గృహాల్లోని టీవీలు, ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు, గృహపరికరాలు పూర్తిగా కాలిపోయాయి. నివాస గృహాల్లోకి రెండు ఫేస్‌లు కరెంటు సరఫరా కావడంతో ఫ్యాన్‌లు వేయకుండానే తిరుగుతున్నాయని బాధితులు తెలిపారు. అనుమలవీడులో లైన్‌మెన్ బదిలీపై వెళ్లిపోవడం, అనుమలవీడు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న జేఎల్ఎం పత్తా లేకుండా పోవడంతో గ్రామంలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా మారాయి. ఈ విషయంపై విద్యుత్‌శాఖ ఏడీకి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో విద్యుత్ సమస్య తీవ్రంగా మారింది.

చర్చి నిర్మాణానికి బూచేపల్లి విరాళం



చర్చి నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి: మండలంలోని చందలూరులో చర్చి నిర్మాణానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు రూ.1.5 లక్షలు విరాళం అందజేశారు. ఆయన నివాసంలో చర్చి నిర్వాహకులు కలిసి చర్చి నిర్మాణానికి సహకరించాలని కోరడంతో అందుకు స్పందించిన ఆయన వెంటనే నగదు అందజేశారు. అందుకు వారు బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్ర కొండకు కూడా..

చలివేంద్ర కొండపై నిర్మిస్తున్న కళ్యాణ మండపం, అన్నదాన సత్రానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు రూ.3 లక్షల విరాళం అందజేశారు. నిర్వహకులు శివప్రసాదరెడ్డిని తన నివాసంలో కలిసి నిర్మాణ విషయం తెలపగా వెంటనే ఆయన స్పందించి మూడు లక్షల విరాళం అందజేశారు. నిర్వహకులు బూచేపల్లి వెంకాయమ్మకు, శివప్రసాద రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

కంభం: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు అమ్మవారి గ్రామోత్సవం పట్టణంలోని పురవీధుల్లో వైభవంగా నిర్వహించారు. బుధవారం అర్ధ రాత్రి స్థానిక అమ్మవారిశాల నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం జామియా మసీదు సెంటర్, చౌక్ సెంటర్, రామాలయం వీధి, అంకాళమ్మ తిప్ప, సాదుమియావీధి, తెలుగువీధి మీదుగా సాగుతూ గురువారం ఉదయం ముగిసింది. గ్రామోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. కోలాటం, డ్యాన్స్‌బేబి డ్యాన్స్, విచిత్ర వేషధారణలు, కేరళ వాయిద్యాలు అందరినీ అలరించాయి. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సీఐ రాజేష్ కుమార్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

గిద్దలూరురూరల్: దసరా ముగింపు సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం వసంతోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని ముండ్లపాడులో అమ్మవారి ఉయ్యాలపేరంటం వైభవంగా నిర్వహించారు. ఉంజలసేవ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు.



కంభం: గ్రామోత్సవంలో అమ్మవారు

ఆర్టీసీ కార్గో సేవలపై అవగాహన

మార్కాపురం: ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు కోరారు. గురువారం డిపో వద్ద సిబ్బంది, ప్రయాణికులకు ఆర్టీసీ కార్గో సేవలపై అవగాహన కల్పించారు. ఆర్టీసీలో పార్శిల్ బుక్ చేసుకుంటే డోర్ డెలివరీ కూడా ఇస్తామని చెప్పారు. కార్గో సేవలపై ప్రజల్లో విశ్వసనీయత ఉందని, 24 గంటల్లోనే డెలివరీ చేస్తున్నామన్నారు. కార్గో సేవలపై ఆర్టీసీ ఉద్యోగులు కూడా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న డీఎం నరసింహులు

స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన



జగన్నాథపురంలో స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

తర్లుపాడు: ఇంటింటికి కుళాయి ద్వారా మంచినీటిని అందించేందుకు చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా మండలంలోని జగన్నాథపురంలో స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని తహసీల్దార్ అబ్దుల్ హమీద్ గురువారం పరిశీలించారు. సుమారు 900 కిలోలీటర్ల సామర్థ్యం మేర నీరు నిల్వ చేసేందుకు గాను 10 సెంట్ల స్థలాన్ని కేటాయించినట్లు ఆయన తెలిపారు. జిల్లా ప్రజల నీటి కష్టాలు తీర్చేందుకు గొట్టిపడియ వద్ద 600 కోట్లతో నిర్మిస్తున్న ఇంటెక్ వెల్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని ఇక్కడకు చేర్చనున్నారు. 12 గ్రామాలకు ఈ సంప్ ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు. మండలంలోని మేకలవారిపల్లి, గొల్లపల్లి, తర్లుపాడు తదితర ప్రాంతాల్లో పంపులు నిర్మించి ఇంటింటికి కుళాయి ద్వారా శుద్ధ జలం అందించనున్నారు.

నేడు ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

తర్లుపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ మురారి సుబ్బమ్మ, ఎంపీటీసీ వెంకటయ్య, సొసైటీ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెన్నా ఇందిర హనుమారెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

పాల ట్యాంకర్, మినీ వ్యాన్ ఢీ

అద్దంకి: బొప్పాయి కాయల లోడు మినీ వ్యాన్, పాల ట్యాంకరు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన బుధవారం అర్ధరాత్రి దాటిని తరువాత మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ గుండ్లకమ్మ బ్రిడ్జిపై జరిగింది. అందిన సమాచారం మేరకు.. అద్దంకి వైపు నుంచి వస్తున్న బొప్పాయి లోడ్ వ్యాన్, దర్శి వైపు నుంచి వస్తున్న పాల లారీని ఢీకొట్టింది. దీంతో బొప్పాయి లోడ్ ముందు భాగం దెబ్బతినగా, డ్రైవర్ గోపిశెట్టి సుబ్బయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది స్థానికులు క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీశారు. తొలుత అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరువాత మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ సుబ్బయ్య